




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 5వ భాగం

1849 జూన్ 9 వ తేదిన మరొకసారి గమ్యం తెలియని బాటసారి లాగ పారిస్ లో అడుగుపెట్టాడు మార్క్స్. సంవత్సరం క్రిందట ఆయన వదిలేసిన పారిస్ లాగ లేదు ఇప్పుడు. ఆయనకు తెలిసిన వాళ్ళ ప్రభుత్వం కూలిపోయింది. ఈ కొత్త ప్రభుత్వం నుండి తనకు ప్రమాదం వున్నదని గ్రహించి, 'రాంబోస్' అనే మారు పేరుతో, ఎంత కాలమో తెలియని బాట పట్టాడు మార్క్స్. ఒకనెల రోజుల తర్వాత జెన్నీ, పిల్లల్ని తీసుకొని పారిస్ వచ్చి భర్తను కలుసుకుంది. గతంలో అక్కడ కొంత కాలం వున్న నగరమే అయినప్పటికీ కూడా, జెన్నీ కి ఏదో తెలియని భయం. మార్క్స్ తన దగ్గర వున్న డబ్బులన్నీ, జర్మనీ లో వుండగా తను నడిపిన న్యూస్ పేపర్ కి ఖర్చు పెట్టేశాడు. మళ్ళీ ఇప్పుడు పారిస్ లో కొత్త జీవితానికి డబ్బుల కోసం కటకట మొదలయ్యింది. జర్మనీ లోని పేపర్లకి కరపత్రాలు రాయడం వల్ల కొంత ఆదాయం వచ్చేది గానీ, అది స్థిరమైన ఆదాయం కాదు.

ఇంతలో పులి మీద పుట్రలాగా ఫ్రెంచ్ పోలీసులు మార్క్స్ ఇంటి తలుపులు తట్టారు. వెంటనే పారిస్ వదిలి వెళ్ళాలని నోటీసులు అందజేశారు. జెన్నీకి వెన్నులోంచి వణుకు మొదలయ్యింది. వచ్చి నెల రోజులైనా కాలేదు. మళ్ళీ ఎక్కడికి? ఎంత కాలం ఇలా? అన్నీ సమాధానం లేని ప్రశ్నలే. ఆమె అంతగా వ్యాకులపడడానికి కారణం కూడా వుంది. అప్పటికే ఆమె ఏడు నెలల గర్భవతి. మార్క్స్ ఫ్రెంచ్ అధికారులకు నచ్చజెప్పాలని చూశాడు. "రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనను. నేనేదో ఎకనామిక్స్, పాలిటిక్స్ లాంటి పుస్తకాలు రాసుకుంటూ వుంటాను. అంతకు మించి స్థానిక రాజకీయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కల్పించుకోను." అన్నాడు.

దానికి వాళ్ళు " ఇంతకుముందు ఇలాగే చెప్పి బెల్జియం వెళ్లావు. అక్కడ ఏం చేసావో మాకు గుర్తుంది. నీ మాటలు నమ్మలేం. మీరు పారిస్ వదలి వెళ్లిపోవాలి. కావాలంటే ఫ్రాన్స్ చివరలో 'బ్రిటనీ' కి వెళ్ళిపొండి. అక్కడికైతే అనుమతి ఇస్తాం." అన్నారు. ఇప్పుడైతే ఫ్రాన్స్ లో ఈ 'బ్రిటనీ' అనే ఊరు సుందరమైన పర్యాటక ప్రదేశం. గానీ, 200 సంవత్సరాల క్రితం అదొక నరకప్రాయమైన ప్రదేశం. అంటు వ్యాధులు ఎక్కువగా ఉండేవి. అక్కడకు వెళ్ళడం అంటే, మృత్యువుతో సమానమే. అందుకని ఆ ప్రతిపాదనకు ఇష్టపడక మరొక విజ్ఞప్తి చేశాడు.

"కనీసం నాకు స్విట్జర్లాండ్ కి పాస్ పోర్ట్ ఇవ్వండి. అక్కడకు వెళ్తాను." అన్నాడు. ఎందుకంటే, అక్కడ ఎంగెల్సు ఉన్నాడు. కనీసం ఆయన దగ్గర ఉందామని అనుకున్నాడు. అయితే, ఫ్రెంచ్ ప్రభుత్వం .." అలా పాస్ పోర్ట్ ఇవ్వడానికి మేం ఒప్పుకోము. ఒకే ఒక్క సహాయం నీకు చేయగలం. లండన్ వెళ్ళడానికి అయితే ట్రావెల్ డాక్యుమెంట్స్, ఇస్తాం." అన్నారు.ఇన్ని సంప్రదింపులు జరిగాక, ఇక ఫ్రెంచ్ ప్రభుత్వం నుండి ఎలాంటి తోడ్పాటు లభించదని తెలుసుకున్నాక, వాళ్ళు ఇచ్చిన డాక్యుమెంట్స్ తీసుకొని1849 ఆగస్ట్ 26న లండన్ వెళ్ళాడు. అక్కడ ఒక మిత్రుడి దగ్గర తలదాచుకున్నాడు. అంటే, ప్రష్యా నుండి వచ్చేసిన 2 నెలలకే ఫ్రాన్సును కూడా వదిలివెయ్యాల్సి వచ్చింది. ఇక్కడ జెన్నీ పారిస్ లోనే వుండి, ఆ 'కొలోన్' నుండి తెచ్చుకున్న సామాన్లు అమ్మేసుకొని, మిత్రులు ఎవరో దారి ఖర్చులకు డబ్బులు ఇస్తే, ముగ్గురు పిల్లల్నీ, హెలెన్ ని వెంటబెట్టుకొని మార్క్స్ వెళ్ళిన నెల తర్వాత సెప్టెంబర్ లో లండన్ చేరుకుంది.

అప్పట్లో లండన్ వెళ్ళాలంటే, ఇప్పట్లో లాగ విమానాలు లేవు. 'ఇంగ్లీష్ చానల్' దాటుకొని వెళ్ళాలి. అలా వెళ్ళాలంటే, పడవల్లో గానీ, స్టీమర్లలో గానీ వెళ్ళాలి. ఒక స్టీమర్ లో అందరినీ తీసుకొని బయలుదేరింది జెన్నీ. స్టీమరు దిగగానే భర్త వచ్చి రిసీవ్ చేసుకుంటాడని అనుకుంది గానీ, మార్క్స్ ఎక్కడా కనిపించలేదు. ఎవరో ఒక వ్యక్తి వచ్చి చెప్పాడు "మార్క్స్ కు విపతీతంగా జ్వరంగా వుంది. కలరా ఏమోనని అనుమానంగా వుంది. అందుకనే రాలేకపోయాడు.

నన్ను పంపించాడు. మిమ్మల్ని ఏదైనా హోటల్ లో పెడతాను రండి. ” అని చెప్పి తీసుకుని ఒక బోర్డింగ్ హౌస్ లో పెట్టాడు. ఆ గదిలోకి వెళ్ళగానే ఒక్కసారిగా శూన్యం లాగ అనిపించింది. వేసవి కాలం. విపరీతమైన వేడి. కొత్త ప్రదేశం. భాష సరిగ్గా రాదు. భర్తకు అనారోగ్యం. ఎప్పుడు వస్తాడో తెలియదు. ముగ్గురి పిల్లలతో ఎవరి దయ మీదనో బ్రతకాల్సిన పరిస్థితి. అంతా ఆగమ్య గోచరంగా వుంది. ఎలా ఉండబోతుంది భవిష్యత్తు?

అయితే, ‘ఎక్కడో ఒక దగ్గర స్థిరంగా వుండాలి’ అనే ఆమె కోరికైతే తీరింది , ఆమె మరో 30 ఏళ్ళ పైగా, అదే లండన్ లో వుంది. కాకపోతే, సుఖంగా, ప్రశాంతం గా కాదు. అంత వరకూ వాళ్ళకు ఎదురైన నటువంటి పేదరికం కన్నా, కష్టాల కన్నా ఎన్నోరెట్లు ఎక్కువైన దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఆమె మరణించే వరకూ లండన్ లోనే వుంది. ఆ వివరాలన్నీ తరువాత తెలుసుకుందాం.

అప్పటి లండన్ లో పరిస్థితులు ఎలా ఉండేవంటే, దాదాపు యూరప్ అంతటా ఎక్కడ సంక్షోభం తలెత్తినాగానీ, వాళ్ళందరూ పారిపోయి లండన్ చేరుకునేవారు. అంతకు ముందు ఫ్రాన్స్ వెళుతుండేవారు. కానీ, ఫ్రాన్స్ లో సంక్షోభం తలెత్తాక అందరూ లండన్ వస్తున్నారు. ఆ లండన్ వచ్చిన కాందిశీకులందరూ ఎక్కడో ఒక దగ్గర చిన్నచిన్న పనులు చేసుకోవడం, లేకపోతే అడుక్కోవడం లాంటివి చేస్తుండేవారు. కొంతమంది అండర్ గ్రౌండ్ లో వుండేవారు. ఇలా రకరకాలుగా చాలా దుర్భరమైన పేదరికాన్ని అనుభవిస్తుండేవారు. వాళ్ళందరితో కూడా లండన్ రోడ్లన్నీ జన ప్రవాహం లాగ ఉండేవి. అయితే, 200 సంవత్సరాల క్రితం అంత జనాభా ఉండడానికి లండన్ సంసిద్ధంగా లేదు. రోడ్లన్నీ కూడా చెత్తా చెదారంతో నిండి పోయేవి. వాటిని శుభ్రం చేయడానికి కూడా సౌకర్యాలు లేక, వాటిని ఎత్తి, పక్కనేవున్న ‘థేమ్సు’ నదిలోకి విసిరేస్తుండేవాళ్ళు. దాంతోటి అంతా కలుషిత వాతావరణం. ‘కలరా‘ లాంటి అంటువ్యాధులు తరచూ ప్రబలుతూ ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లోకి, ఇలాంటి పరిసరాల్లోకి మార్క్సు, జెన్నీలు వచ్చి పడ్డారు.

ఒక వారం తర్వాత మార్క్సుకి కొంచెం ఆరోగ్యం మెరుగు పడింది. అప్పుడు వచ్చి, భార్యా పిల్లల్ని తీసుకొని “చెల్సియా”అని అక్కడకు కొద్ది దూరంలో ప్రాంతంలోకి మారారు. అక్కడ ‘కింగ్స్ రోడ్ ‘ లో రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకొని మారారు. ఎంగెల్సు కొద్దిగా డబ్బులు పంపించాడు.

ఎంగెల్సు ను మార్క్సు అడిగాడు “నువ్వు కూడా వచ్చేసెయ్ లండన్ కి, మనం ఏదైనా న్యూస్ పేపర్ పెడదాము. ఈసారి కేవలం ప్రజల కోసమూ, ప్రజల చైతన్యం అవడం కోసమూ కాకుండా, మరీ వ్యాపారాత్మకంగా కాకుండా, మనకు కూడా డబ్బులు మిగిలేలా చూసుకుందాము. నువ్వొస్తే నాకు ధైర్యంగా వుంటుంది.” అని వుత్తరం రాశాడు. ఆ తరువాత

కొద్ది రోజులకి ఎంగెల్సు వచ్చి, మార్క్సును కలుసుకున్నాడు. అక్కడే ఒక రూము అద్దెకు తీసుకుని, వాళ్ళతో పాటే వున్నాడు.

ఇక్కడ నుండి ప్రారంభించి మార్క్స్, జెన్నీలు మరణించే వరకు అంటే, మరొక 34 సంవత్సరాలు వరకూ లండన్ లోనే వున్నారు. వాళ్ళ జీవితాల్ని రెండు కోణాల నుండి చూడవచ్చు.

1.ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలూ, ఆర్ధిక రాజకీయ విశ్లేషణ "కేపిటల్ "గ్రంధ రచన. ఇది అందరికీ తెలినదే.

2.మార్క్స్, జెన్నీల కుటుంబ విశేషాలు. వాళ్ళు ఎదుర్కొన్న దారిద్ర్యం, కష్టాలూ, కన్నీళ్ళూ ఇదంతా మరొక కోణం. ఈ రెండిటికీ మించి, మార్క్సును నిరంతరం వెంటాడిన అనారోగ్యం. వీలయినంతవరకు ఈ రెండు కోణాల్నిసమాంతరంగా పరిశీలిస్తూ మన కధనాన్ని ముందుకు తీసుకువెళదాం.

1849లో యూరప్ లో తలెత్తినటువంటి తిరుగుబాట్లూ, విప్లవాలూవాటిని అణిచివేసిన విధానం, వీటన్నిటినీ గమనించాక, మార్క్స్, ఎంగెల్సుల ఆలోచనా విధానంలోనూ, కార్యాచరణ గురించి వాళ్ళు తీసుకునేటటు నిర్ణయాల్లో చాలా మార్పులు వచ్చాయి. ప్రభుత్వాలను కూలదోసి, వాటి స్థానంలో సామ్య వాదాన్ని నెలకొల్పాలి అంటే, ఎలాంటి విధానాలను అనుసరించాలి అనేటటువంటి అంశం మీద ఒక అవగాహనకు వచ్చారు ఇద్దరూ. మార్క్స్ లండన్ జీవితం మొదలవగానే ఆయన 3, 4 కార్యక్రమాలు చేపట్టారు.

1.లండన్ లో అజ్ఞాతంలో అయినప్పటికీ, చురుకుగా వున్న "కమ్యునిస్ట్ లీగ్ "అనే సంస్థతో సంబంధాలు పునరుద్దరించుకోవడం.

2.జర్మన్ భాషలో పత్రిక ప్రారంభించి ,ఇక్కడ అంటే, లండన్ లో తలదాచుకుంటున్నటువంటి జర్మన్ పౌరుల్ని, అలాగే జర్మన్ లో ఉన్నటువంటి విప్లవ సానుభూతి పరుల్ని చైతన్య పరచడం. తద్వారా జర్మనీ లో విప్లవానికి బీజాలు వెయ్యడం.

3.లండన్ లో ప్రవాసం గడుపుతున్న జర్మన్లకి ఆర్ధికంగా సహాయం చేయడం.

ముందుగా "జర్మన్ రెఫ్యూజీ ఎయిడ్ కమిటి" అనే సంస్థను ప్రారంభించారు. మార్క్స్, ఎంగెల్సుల మిత్రులు కొంత మంది లండన్ లో ఆ మూల నుండి, ఈ మూలకు ప్రయాణించి, జర్మనీ లో తమకు పరిచయం వున్నసానుభూతి పరులకు ఉత్తరాలు రాసి, చందాలు చేసి, లండన్ లో ఇబ్బంది పడుతున్న జర్మన్ కాందిశీకులకు ఆర్ధిక సహాయం అందజేశారు. తన ఇంట్లో ఎలాగూ ఆర్ధిక ఇబ్బందులు కొనసాగుతున్నాయి. అయినా బయట జర్మన్ కాందిశీకులకు ఎక్కువ సహాయం చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాడు మార్క్స్. ఆ కమిటీ యొక్క సభ్యులందరూ ఒక నియమం పెట్టుకున్నారు. "వసూలు

చేసినటు వంటి విరాళాల్ని ఏవీ కూడా తమ కమిటీ సభ్యులు సొంతానికి వాడుకోకూడదు. అన్ని కూడా కాంది శీకులకు మాత్రమే ఇవ్వాలి." అనే నిర్ణయం చేసుకొని, దానికి కట్టుబడి, అలా విరాళాలు సేకరించడం, వాటిని అర్హులకు అందజేయడం చేశారు.

తరువాత మార్క్స్ పత్రికను ప్రారంభించాలనే కార్యక్రమానికి పెట్టుబడి కావాలి కదా! వెతగ్గా..వెతగ్గా..పత్రికకు పెట్టుబడి పెట్టడానికి ఒకతను దొరికాడు. లండన్ వెళ్ళిన 5,6 నెలలకి జర్మన్ భాషలో పత్రికను ప్రారంభించి, ఆనాటి రాజకీయ, సాంఘిక సమస్యల మీద వ్యాసాలు రాస్తూ నెలకి ఒకటి చొప్పున 5,6 సంచికలు తీసుకువచ్చారు. అయితే, అవి అక్కడ జర్మనీలో ప్రష్యా ప్రభుత్వం ద్రుష్టికి వెళ్ళడం, వాళ్ళు అడ్డుకోవడం, 'ఈ పత్రికలను మా దేశంలోకి రానివ్వం" అని నిషేధించాక అవి కూడా ఆగిపోయాయి. మార్క్స్ తరువాత కార్యక్రమం "కమ్యునిస్ట్ లీగ్ " తో సంబంధాలు పునరిద్దరించుకోవడం. అప్పటికి కమ్యునిస్ట్ లీగ్ లో ఉన్నటువంటి ముఖ్యమైన నాయకులు ఏమన్నారంటే...

" జర్మనీ లో మనం వెంటనే తిరుగుబాటు ప్రయత్నాలు ప్రారంభించాలి. ఒక్కసారి మనం మొదలుపెడితే, అందరూ ఇందులో భాగస్వాములు అవుతారు." అని మార్క్స్, ఎంగెల్సుల మీద ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే, దానికి వాళ్ళు ఏమన్నారంటే,

"విప్లవం అనేది ప్రణాళిక బద్దం గా, దశలవారిగా జరగాలి, ఉద్యమకారుల్లో సరైన అవగాహన లేకుండా, హఠాత్తుగా మొదలుపెడితే ప్రభుత్వం వెంటనే అణగదొక్కడానికి అవకాశం వుంటుంది. ఇది రాత్రికి రాత్రికి జరిగే పనికాదు. ముందుగా శాస్త్రీయ విశ్లేషణలతో, ఉద్యమకారుల్ని చైతన్య వంతుల్ని చేద్దాం." అని మిగతావాళ్లకు నచ్చజెప్పడానికి ప్రయత్నం చేశారు. ఈ రకమైన బేధాభిప్రాయలతో కొంతమంది సభ్యులు వెళ్ళిపోయారు.

ఇంకో విశేషం ఏమిటంటే,"జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషన్ సొసైటి " అనే బహిరంగ సంస్థ వుంది. అది ఈ కమ్యునిస్ట్ లీగ్ కు ఫ్రంట్ ఎండ్ గా వుండే సంస్థ . దానితో కూడా పనిచేశాడు మార్క్స్. కాకపోతే, దాని సభ్యులతో కూడా ఏవో బేధాభిప్రాయలే రావడం వలన దానికి రాజీనామా ఇచ్చాడు గతంలో. వీటన్నిటి వలన లండన్ లో ఉన్నటువంటి జర్మనీయుల్లో...'మార్క్స్ వర్గం వారూ, మార్క్స్ వ్యతిరేక వర్గం వారు' అని రెండు గ్రూపులుగా విడిపోయారు.

ఇంక ఈ సంవత్సర కాలంలో మార్క్స్ కుటుంబంలో ఏం జరిగిందో తెలుసుకుందాం.

జెన్నీ పిల్లలతో కలసి లండన్ వచ్చేసరికి 8 నెలల గర్భిణి. 1849 నవంబర్ 5న ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ అబ్బాయికి "హెన్రిక్ "అని పేరు పెట్టుకున్నారు. జెన్ని ఇలా ఒకదేశం నుండి మరొక దేశం తిరగడం, ఆరోగ్యాన్ని సరిగ్గా

చూసుకోక పోవడం, వీటన్నిటి కారణాల వల్ల పుట్టిన పిల్లవాడు చాలా బలహీనంగా పుట్టాడు. పుట్టిన దగ్గరనుండి చాలా అనారోగ్యంగా ఉండేవాడు. ఎప్పుడూ ఏడుస్తూ ఉండేవాడు. రాత్రుళ్ళు ఎవరికీ నిద్ర వుండేది కాదు. ఆ పిల్లవాడి ఏడుపు జెన్ని అనుకుందట..' నా లోపల పైకి చెప్పుకోలేని బాధలూ, విషాదాలూ వున్నాయి. నా కష్టాలకి ప్రతి రూపం ఏమో యీ 'హెన్రిక్ '" అని.

ఆ పిల్లవాడు పుట్టినపుడు జెన్నికి 'డా: లుడ్విగ్ బోయర్' అనే ఒక డాక్టర్ సహాయం చేశాడు. అతను తనకి ఇవ్వాల్సిన ఫీజు గురించి అడగడం మొదలుపెట్టాడు. మార్క్స్ ముందే చెప్పాడు ఆ డాక్టర్ గారికి "ఫీజు అంతా ఒకేసారి ఇచ్చుకోలేను. ప్రస్తుతానికి ఇది వుంచండి. కొద్ది నెలల్లో మిగతాది ఇచ్చేస్తాను."అన్నాడు. ఆ కొద్ది నెలలూ రాక ముందే "మిగతా ఫీజు కూడా ఇవ్వాలి." అని ఒత్తిడి తేవడమే కాకుండా, ఫీజు ఇవ్వకపోతే కోర్టులో దావా కూడా వేస్తాను"అని బెదిరించాడు. ఈ వివాదం తోటి, పిల్లవాడికి ఏ అనారోగ్యంతో వున్నా, డాక్టర్ దగ్గరకు కూడా వెళ్ళలేని పరిస్థితి ఎదురయ్యింది. అభం శుభం తెలియని ఆ బాబుకి ఆకలి వేసినా, అనారోగ్యం కలిగినా ఏడుపు ఒక్కటే గత్యంతరం అయింది. రోజుకి రెండు గంటలు మించి నిద్రపోయేవాడు కాదు. తరచూ అపస్మారకం లోకి వెళ్లిపోతుండేవాడు.

జెన్నీ యొక్క ఆరోగ్యం కూడా అంతంత మాత్రం గానే వుండేది. పిల్లవాడికి పాలు ఇవ్వడంకూడా కష్టం గానే వుండేది. 185o మే ప్రాంతాలలో ఒక సంఘటన జరిగింది. ఆ రోజుకూడా జెన్ని మామూలుగానే పిల్లవాడికి పాలు ఇస్తోంది. పాలు తాగుతున్న 'హెన్రిక్' ఒక్క సారి కెవ్వుమని బిగ్గరగా ఏడ్చాడు. జెన్ని కంగారు పడుతూ చూసింది. పిల్లవాడి నోట్లో పాల చుక్కలు బదులు, రక్తపుచుక్కలు వున్నాయి. 'తల్లి తనం' పాలు ఎండి పోయి, రక్తాన్ని స్రవిస్తోంది. ఒక్కసారి బావురు మంది జెన్నీ. పక్కనే ఆడుకుంటున్న ముగ్గురు పిల్లలూ కూడా ఏం జరుగుతుందో తెలియక, అమ్మను చుట్టేసుకున్నారు. నలుగురి పిల్లల మధ్యన నిస్సహాయంగా ఉండిపోయింది జెన్నీ.

సరిగ్గా అదే సమయంలో తలుపు తోసుకుంటూ లోనికి వచ్చింది ఇంటి ఓనర్. అక్కడ ఆమెను 'లాండ్ లేడి' అంటారు. ఆమె వచ్చి రావడంతోనే బిగ్గరగా అరుస్తూ "మీరు ఇంకా 5 పౌండ్లు బాకీ వున్నారు. ఇప్పుడే ఇవ్వాలి " అని దౌర్జన్యం గా అరవడం ప్రారంభించింది. జెన్ని నచ్చజెప్పాలని చూసింది. "మీ 5 పౌండ్లు త్వరలోనే తీర్చేస్తాం. ఇదిగో చూస్తున్నావు కదా! మా పరిస్థితి. మార్క్స్ ఇంటికి రాగానే చెబుతాను. "అని సర్ది చెప్పబోయింది.

"మీ ఆయన్ని అడిగి..అడిగి..విసుగొచ్చి ఇలా సరాసరి నీ దగ్గరకు వచ్చాను."అని ఆ లాండ్ లేడి అంటూ ఉండగానే, ఆమెతో వచ్చినటువంటి మరో ఇద్దరు మనుషులు, ఆ గది లో వున్న కొద్ది పాటి బట్టలూ, దుప్పట్లూ,పిల్లల చేతిలోవున్న ఆట బొమ్మలు కూడా లాక్కుపోయారు."ఇదిగో సాయంత్రంలోగా బాకీ కట్టకపోతే, మిగతావి కూడా తీసుకువెళ్లిపోతాం." అని బెదిరించి వెళ్లారు. జెన్నికి ఏం చేయాలో తోచలేదు. ఆ దగ్గరలోనే "కాంగ్రాడ్' అని మార్క్స్

మిత్రుడు ఒకతను వున్నాడు. అతను గుర్రపు బండి నడుపుతుంటాడు. పోనీ అతని దగ్గరకు వెళ్లి సహాయం అడుగుదామని పిల్లల్ని చూసుకోమని పని మనిషి హెలెన్ కి అప్పజెప్పి, రోడ్డు మీదకు వచ్చింది జెన్నీ.

4, 5 అడుగులు వెయ్యగానే ఎదురుగుండా ఇద్దరు మనుషులు రక్తం కారుతున్న ఆ "కాండ్రాడ్' ని మార్క్స్ ఇంటికి తీసుకువస్తున్నారు. ఏమయ్యిందంటే అతను నడిపే గుర్రపు బండి తాలుకా గుర్రం, ఎందుకో గాని బెదరి పరుగు అందుకునే సరికి, అతను కింద పడ్డాడు. దారుణంగా గాయాలయ్యాయి. మిత్రుడు కదాని మార్క్స్ ఇంటికి తీసుకువస్తున్నారు. చూడండి పరిస్థితులు ఎలా వున్నాయో? పాపం బాబుకి పాలు ఇవ్వలేక రక్తం వస్తున్నది, మరోపక్క లాండ్ లేడి అద్దె డబ్బులు ఇవ్వలేదని ఇంట్లో సామాన్లు తీసుకెళ్ళిపోయింది. మిత్రుడి సహాయం కోసమని వెళుతుంటే, అతనికే గాయలయి, వీళ్ళ ఇంటికే వస్తున్నాడు. బాధలూ,కష్టాలూ, ఇబ్బందులూ విడివిడిగా రావు. అన్ని ఒకేసారి కట్టగట్టు కొని ఒక్క సారే వస్తాయి అనడానికి ఇదో పెద్ద ఉదాహరణ.

సరే! ఆ సాయంకాలం మార్క్స్ ఇంటికి వచ్చాడు. వేరే ఇల్లు వెతకడం మొదలుపెట్టారు. కానీ, నలుగురు పిల్లలున్న కుటుంబానికి ఇల్లు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఒక మిత్రుడి సహాయంతో తాత్కాలికంగా ఏదో హోటల్లో రెండు రూములు మాట్లాడుకున్నారు. సామాన్లు తెచ్చుకుందామని ఇంటికి  వచ్చారు. అప్పటికే చీకటి పడిపోయింది. అయితే, అప్పట్లో వున్న చట్టాల ప్రకారం, చీకటి పడిన తర్వాత ఇల్లు ఖాళీ చెయ్యకూడదట. ఎందుకని? ఒక వేళ తమ సామాన్లతో పాటూ, మిగతావి కూడా తీసుకెళ్ళి పోతారనేమో నని. ఈలోగా ఆ ఇంటి ఓనర్  పోలీసులకి రిపోర్ట్ ఇచ్చింది. పోలీసులు వచ్చి "మీరు చీకటి పడ్డాక వెళుతున్నారేమిటి?"అన్నారు. అక్కడ ఏదో గొడవ జరుగుతున్నదని 2, 3 వందల మంది గుమికూడారు. మార్క్స్, జెన్నిలకు అంత అవమానకరమైన పరిస్థితులు ఎప్పుడూ ఎదురవ్వలేదు. సరే! వాళ్ళు చట్టాన్ని వ్యతిరేకించలేక, రోడ్డు మీద సామన్లని మళ్ళీ ఇంట్లోకి మార్చారు. పిల్లలకి ఏం జరుతున్నదో అర్థం కావడం లేదు. మర్నాడు ఎలాగైతేనేం "లాసెస్టర్ స్క్వేర్ ' అని అక్కడకు దగ్గరలోనే ఉన్నటువంటి ఒక చిన్న హోటల్ లోని రెండు గదుల్లోకి మారారు.

ఆ రెండు గదుల్లో కూడా ఒకటి, రెండు వారాలు మించి ఉండలేకపోయారు. చిన్న పిల్లడు 'హెన్రిక్' రాత్రంతా ఏడుస్తున్నాడని, పక్కగదుల్లో వాళ్ళు ఫిర్యాదు చేస్తున్నారని, హోటల్ గదులు ఖాళీ చెయ్యమన్నారు. కాస్త ఊరట ఏమిటంటే, ఇవన్నీ కూడా జెన్నీ వాళ్ళ అమ్మకు తెలిసి, ఆమె హుటాహుటిన ట్రయర్ నుండి లండన్ వచ్చింది."ఎందుకు? నేను డబ్బులు ఇస్తాను. ఎక్కడైనా మంచి ఇల్లు తీసుకోండి."అంది. ఆ హోటల్ దగ్గరలోనే " సోహో"అనే ప్రాంతం వుంది. ఈ ప్రాంతం ఇప్పుడు లండన్ మధ్యలో వుంది. ఆ 'సోహో'లో రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకొని, అందులోకి వెళ్లారు. అది పేరుకే రెండు గదులు గానీ, ఒకటే పెద్దది. రెండోది పెద్ద బీరువా లాగ వుంటుంది.ఆ ఇంటి అడ్రస్ "64 డీన్స్ట్రీట్, సోహో." ఇప్పుడు కూడా ఇంటర్నెట్ లో సెర్చ్ చేసి చూడవచ్చు.ఈ ఇళ్లన్నీ కూడా 200 సంవత్సరాల నుండి అలాగే వున్నాయి.ఈ

డ్రీం స్ట్రీట్ లోనే ఆ తరువాత కొద్ది సంవత్సరాల పాటు రకరకాల ఇళ్ళళ్ళకి మారుతూ, అక్కడే వున్నాడు మార్క్స్. మీరు ఎప్పుడైనా లండన్ వెళితే, ఈ సోహో ప్రాంతంలో డ్రీం స్ట్రీట్ కి వెళితే, ఆ ఇళ్ళ మీద ప్లేట్స్ వుంటాయి.”కార్ల్ మార్క్స్ ఇక్కడ జీవించాడు.”అని. కాకపోతే, సంవత్సరాలలోనూ, అంతస్తుల్లోనూ కాస్త వ్యత్యాసం వుంటే ఉండవచ్చు గానీ,ఇప్పటికికూడా అక్కడకు వెళ్ళిన వాళ్లకు కార్ల్ మార్క్స్ యొక్క జ్ఞాపకాల్ని చూడవచ్చు.

185o మే లో వున్నాం మనం. ఇక్కడ నుండి ప్రారంభించి, 185o చివరి వరకూ మార్క్స్, జెన్నీల జీవితంలో జరిగిన మరికొన్ని కీలకమైన సంఘటనలు చూద్దాం. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, జెన్నీ, మార్క్స్ ను పల్లెత్తు మాట అనేది కాదు. ఎందుకంటే, మార్క్స్ కు ఎంతమంది మద్దతు దార్లు వుండేవారో, అంతమంది వ్యతిరేకులు కూడా ఉండేవారని అనుకున్నాం కదా! అలాంటి పరిస్థితుల్లో మార్క్స్‌కు జెన్నీ సహకారం లేకపోతే, మార్క్స్ మరింత ప్రమాదంలో పడిపోయేవాడు. మార్క్స్‌లో యే లోపం కనిపిస్తుందా...ఆయన్ని ఎండ గడదామా? విమర్శిద్దామా?తొక్కేద్దామా? అని చూస్తుండేవాళ్ళు చాలా మంది. వాళ్లకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా, కుటుంబం లోని సమస్యలేవీ బయటకు రాకుండా, కాపాడుకుంటూ వచ్చింది జెన్నీ. మార్క్స్ నుండి ఆమె ఎప్పుడూ కోరుకున్నది ఏమిటంటే, స్వచ్ఛమైన ప్రేమ. నిజాయితీ గల అభిమానం మాత్రమే. వాటికి కూడా అగ్ని పరీక్షలు ఎదురయ్యే సందర్భాలు వున్నాయి రాబోయే 5,6 నెలల్లోనే అవేమిటో తరువాత తెలుసుకుందాం.

మనకో అనుమానం రావచ్చు. ఇతర దేశాల వాళ్ళు మార్క్స్‌ని త్వర త్వరగా బహిష్కరించారు కదా! ఈ ఇంగ్లాండ్ ద్రుష్టికి రాలేదా అని. అంటే, వచ్చింది. సుమారు ఇవే రోజుల్లో 185o మేలో ప్రష్యా రాజు మీద హత్యాప్రయత్నం జరిగింది. ఆ చేసిన వ్యక్తి ఒక మతి భ్రమించిన వ్యక్తి. ప్రష్యా అంటే, మార్క్స్ సొంత దేశం. అయితే, ప్రష్యా అధికారులు ఆ సంఘటనను తీవ్రంగా పరిగణించి, దీనికి కారణం లండన్  అండర్ గ్రౌండ్ లో వున్న జర్మనీ వాళ్ళు. ముఖ్యంగా వాళ్ళ నాయకుడు మార్క్స్ అని, నివేదికలు తయారుచేసి, బెర్లిన్ లో వున్న బ్రిటీష్ అంబాసిడర్ కి రిపోర్ట్ చేశారు. ఇటు ఫ్రాన్స్, బెల్జియం ప్రభుత్వాలు కూడా ఇంగ్లండు ప్రభుత్వానికి సందేశాలు పంపించాయి.

“మీ దేశంలో వున్న మార్క్స్ వర్గీయులు చాలా ప్రమాదకరమైన వాళ్ళు. జర్మనీ లోని విప్లవానికే కాదు. బ్రిటిష్ రాణిని హత్య చెయ్యడానికి కూడా కుట్రలు పన్నుతున్నారు. వాళ్ళను మీ దేశం నుండి తరిమేయండి.”అని. అయితే, బ్రిటిష్ ప్రభుత్వం ఎందుచేతనో గానీ, వెంటనే అలాంటి చర్యలేవి తీసుకోలేదు. కాకపోతే, మళ్ళీ పోలీసుల నిఘా మొదలవుతుందేమోనని మార్క్స్,జెన్నీలు లండన్ వదిలేసి, ఇంగ్లాండ్ లోనే ఏదో మారుమూల పల్లెటూరి వెళ్లి అక్కడ బ్రతుకుదాం అనుకున్నారు. కానీ, చేతిలో చిల్లి గవ్వ లేనివారికి అంత దూరం వెళ్లి, అక్కడ స్థిర పడడం ఎలా వీలవుతుంది?అది కూడా కుదరలేదు.

కాకపోతే, మార్క్స్, ఎంగెల్సు లు తమ నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తూ, తమ కార్యక్రమాల్ని సమర్ధించుకుంటూ లండన్ లో వున్న పత్రికలన్నిటికీ ఉత్తరాలు రాశారు. వాళ్ళను సమర్ధిస్తూ మరికొన్ని ఉత్తరాలు వచ్చాయి. ఇదంతా జరిగింది 1850 మే ప్రాంతాలలో. ఇంకొక పరిణామం ఏమిటంటే? మార్క్స్ ఇంటికి నడచి వెళ్ళేదారిలో 'బ్రిటిష్ మ్యుజియం 'వుంది. ఆ మ్యూజియంలో గ్రంధాలయమూ, రీడింగ్ రూమూ వున్నాయి. మార్క్స్ వాళ్ళ దగ్గరకు వెళ్లి, తాను రాస్తున్నటువంటి పుస్తకాలకీ, పరిశీలనలకీ అవసరమని అక్కడకు ఎప్పుడైనా వచ్చేందుకూ ఉండేందుకూ వాళ్ళని ఒప్పించి, అనుమతి తెచ్చుకున్నాడు.

1850 జూన్ మొదట్లో ప్రారంభమైన ఆ రీడింగ్ రూము అలవాటు, ఆ తరువాత జీవితాంతం కొనసాగింది. "కేపిటల్" లాంటి ప్రపంచ ప్రసిద్ధ గ్రంధాలకు కావలిసిన సమాచారం అంతా కూడా ఆ బ్రిటిష్ మ్యుజియం పుస్తకాల నుండే లభించింది. ఆ తరువాత రోజుల్లో ఆ బ్రిటీష్ మ్యుజియం రెండో ఇల్లు అయ్యింది. ఆయన ఎప్పుడో బెల్జియం లో వుండగా రాయడం ఆపేసినటు వంటి "పొలిటికల్ ఎకానమీ "అనే పుస్తకాన్ని కొంత వరకు పూర్తి చేసి, అది కూడా అయిపోయింది అనుకున్నాడు. కానీ, దాన్ని మరింత పొడిగించాలనీ, మరిన్ని భావాలను చేర్చాలని అలా పొడిగించేటటు వంటి క్రమంలో ఈ రీడింగ్ రూం కు వెళ్లి కావలిసిన సమాచారం అంతా సేకరిస్తుండేవాడు. ఆ ప్రయత్నాలే తరువాత 17సంవత్సరాల పాటు కొనసాగి,'కేపిటల్' పుస్తకానికి పునాది అయ్యింది. ఆ వివరాలన్నీ తరువాత తెలుసుకుందాం.

ఇది ఇలా వుండగా మార్క్స్ మిత్రుడు ఎంగెల్సు వున్నాడు కదా! అప్పటికి 5 సంవత్సరాలుగా వాళ్ళ నాన్న అడిగినప్పుడల్లా డబ్బులు పంపిస్తున్నాడు. అయితే, ఎంగెల్సు అమ్మా, నాన్నలకు అతని మీద బెంగ ఎక్కువయ్యింది. అప్పటికి ఎంగెల్సు వయసు 30 సంవత్సరాలు. ఆ సమయాల్లో జరుగుతున్నా తిరుగుబాట్ల వలన ఎంగెల్సు వాళ్ళ నాన్న గారికి జర్మనీ లో వున్న ఫాక్టరీల్లో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. వాళ్లకి 'మాంచెస్టర్' లో ఒక బ్రాంచి వున్నదని గతంలో అనుకున్నాం. అది కూడా సరిగ్గా నడవడం లేదు. చాలా కార్మిక సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్నది. అందుకని ఎంగెల్సు తండ్రి కొడుక్కి ఒక వుత్తరం రాశాడు.

"నువ్వు వచ్చేసి, ఇక్కడ ఫ్యాక్టరీ చూసుకుంటే బాగుంటుంది. నాకు కూడా ఆరోగ్యం సరిగ్గా వుండడం లేదు."అని. అంతే కాక అతని తల్లి కూడా వుత్తరం రాసింది."ఏరా బాబూ! నీకు ప్రపంచంలో శ్రామికుల కష్టాలు కనిపిస్తున్నాయి గానీ, ఇక్కడ కన్నతల్లి ఎదురు చూస్తున్న ఎదురు చూపులూ, కన్నీళ్లు కనిపించడం లేదా? వచ్చేసి ఇక్కడ ఫ్యాక్టరీ అయినా చూసుకో లేదంటే, బ్రిటీష్ ఇండియా లో కలకత్తా అని ఒక నగరం వుంది. అక్కడ 'ఈస్టిండియా' అని ఒక కంపెనీ వుంది అక్కడి కైనా వెళ్ళు." అని. ఎంగెల్సు ఇలా అవ్వడానికి ఇల్లు వదలి ఇలా దేశాలు పట్టుకు తిరగడానికీ, ఫ్యాక్టరీ వదలి వెళ్ళడానికీ మార్క్సే కారణం అని, ఎలా అయినా మార్క్స్ నుండి ఎంగెల్సు విడదీయాలని వాళ్లకు బలీయమైన కోరిక కలిగింది.

ఎంగెల్సు కూడా ఒకసారి తీవ్రంగా ఆలోచించాడు. ఇటు మార్క్సుకు గానీ, వాళ్ళు అనుకుంటున్న కార్యక్రమాలకు గానీ డబ్బులు కావాలి. ఒకసారి కాదు. చాలా సార్లు కావాలి. ఇందుకు పరిష్కారం తను ఫ్యాక్టరీ చూసుకోవాలి. తను అక్కడుంటే వీళ్ళకి సహాయం చేయడానికి వీలవుతుంది. ముఖ్యం గా మార్క్సుకి.

'మార్క్స రాస్తున్నటువంటి 'పొలిటికల్ ఎకానమీ' అనే పుస్తకం పూర్తయితే, ఖచ్చితంగా అది ప్రపంచ రాజకీయ పునాదుల్ని కదిలిస్తుంది.' అని గట్టి నమ్మకం ఎంగెల్సుకి. ఆ ప్రణాళిక పూర్తవ్వాలంటే మార్క్సుకు ఆర్థిక ఇబ్బందులు వుండకూడదు. అలా జరగాలంటే, తను సంపాదించి, మార్క్స కు పంపించడం ఒకటే మార్గం. ఇలా ఇన్ని ఆలోచించి, వాళ్ళ నాన్నగారు చెప్పినటువంటి ఫ్యాక్టరీకి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు. ఎంగెల్సు వాళ్ళ నాన్నకు ఇవేమీ తెలియవు. కాకపోతే, అబ్బాయి వస్తున్నాడు ఫ్యాక్టరీ చూసుకుంటాడు కదాని చాలా సంతోషించారు. మార్క్సుకి ఈ విషయాలన్నివివరంగా చెప్పి, 'మాంచెస్టర్ 'లో తన ఫ్యాక్టరీ కి  వెళ్ళాడు. ఎంగెల్సు అక్కడకి వెళ్లి , డబ్బులు పంపే దాక మార్క్స కి అప్పులిచ్చేవారూ ఆగరు. కుటుంబానికి అవసరమైన ఖర్చులూ ఆగవు.

అదే సమయంలో మరొక వార్త తెలిసింది. జెన్నీ 5వ సారి గర్భవతి. మూడవ నెల. ఎంగెల్సు మాంచెస్టర్ ఎందుకు వెళుతున్నాడో జెన్నీకి తెలుసు. తను కూడా ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఏదైనా పరిష్కారం కనుక్కోవాలి అనుకొని, హాలెండ్ లో వున్న మార్క్స బాబాయ్ 'ఫిలిప్స్' దగ్గరకు వెళ్ళి, మార్క్స రావలిసిన వారసత్వ సంపద గురించి అడగాలని అనుకుంది. అంతకు ముందు కూడా మార్క్స చాలా సార్లు హాలెండ్ వెళ్లి వాళ్ళ బాబాయ్ ని అడిగాడు. వాళ్ళేదో పదో, పరకో విదిలించారు గానీ, చెప్పుకోదగ్గ మొత్తం ఏదీ ఇవ్వలేదు. నేను వెళ్లి కుటుంబ పరిస్థితులు చెబితే, ఆడదాన్నని కనికరించి ఏమైనా ఇస్తారేమోనని బయలుదేరింది జెన్నీ. పిల్లల్ని చూసుకోవడానికి ఎలాగూ హెలెన్ వుంది.

"సరే! అలాగే ప్రయత్నించు తప్పులేదు కదా!"అన్నాడు మార్క్స. చిన్నపిల్లవాడు 'హెన్రిక్ ' చూసుకోవడానికి, జెన్నీ ఆరోగ్యం అంత బాగుండలేదు. పైగా తను మూడు నెలల గర్భిణి. అయినా గానీ, తప్పదు కాబట్టి, హాలెండ్ బయలుదేరింది.15 రోజులు స్టీమరు లో ప్రయాణించి, హాలెండ్ చేరుకుంది. కళ తప్పిన ముఖంతో, నలిగిపోయిన బట్టలతో, నీరసంగా గుర్తు పట్టలేని వున్న జెన్నీ ని చూసాడు మార్క్స బాబాయ్ ఫిలిప్స్. ఆమె వచ్చిన విషయం తెలుసుకొని ముఖం మాడ్చుకున్నాడు. "రెండేళ్ళ నుండి జరుగుతున్నటు వంటి గొడవల వల్ల నా వ్యాపారం దెబ్బ తిన్నది. ఇప్పుడు నేనేమి ఇచ్చే పరిస్థితిలో లేను. పైగా వారసత్వ సంపద నువ్వు అడుగుతున్నావు. అయితే, మీ అత్త గారు పోయిన తర్వాతే మీకు వచ్చేదేదో వస్తుంది."అని కటువుగా చెప్పాడు.

అసలే నీరసంగా 15 రోజులు ప్రయాణించి వచ్చిన జెన్నికి ఇంకా నీరసం వచ్చేసింది. ఆ రాత్రి ఆమె మార్క్సుకి జరిగినదంతా బాధతో ఉత్తరాలు రాసింది.[ఈ ఉత్తరాలన్నీ కూడా చరిత్రకారులకు దొరికాయి.  అలాంటి వాటి ఆధారం గానే ఈ కథని అల్లుకుంటూ 'కార్ల్ మార్క్స జీవిత చిత్రణ' రాస్తూ వచ్చారు చరిత్ర కారులు.] ఎలాగో ఆ లయన్ ఫిలిప్స్

దయతలచి జెన్ని దారి ఖర్చులకు మాత్రం ఇచ్చాడు. వాళ్ళ మనవడు ఆడుకొని వదిలేసి బొమ్మల లోనుండి ఒక బొమ్మను తీసి మీ పిల్లలకు ఇవ్వు."అన్నాడు. వట్టి చేతులతో వెనుతిరిగింది జెన్ని. ఆ స్థితిలో జెన్నీ ని ఊహించుకుంటే...

★ రాచరికపు కుటుంబంలో నుండి వచ్చిన జెన్నీ.
★ట్రియర్ నగరంలో అద్భుత సౌందర్యరాశి అని అందరూ ఆరాధించే జెన్నీ.
★కేవలం మార్క్సు మేధస్సు చూసి అతనిని వివాహమాడిన జెన్నీ.
★భర్త నిర్దేశించుకున్న లక్ష్యాలకూ, చేపట్టిన కార్యక్రమాలకు రాజీలేని మద్దతునిస్తున్నజెన్నీ.
★తద్వారా సంక్రమిస్తున్న దుర్భర పేదరికాన్ని ఆనందంగా కౌగలించుకున్న జెన్నీ.
★ఆ క్రమంలో ఇంట్లో వున్నసమస్త వస్తువుల్ని, ఒక్కోసారి ఆత్మగౌరవాన్ని కూడా తాకట్టు పెట్టిన జెన్నీ.
★భర్త ఎప్పటికైనా ప్రపంచాన్ని మారుస్తాడని గాఢంగా నమ్మిన జెన్నీ.

ఇదిగో ఇప్పుడు నీరసంగా, నిస్సహాయంగా హాలెండు నుండి ఇంటికి బయలుదేరింది. ఇంటికి రాగానే ఎదురొచ్చిన పిల్లలు. చేతిలో ఉన్నదేమో ఒకటే బొమ్మ. పెద్దవాడైన 'ఎడ్గర్'కి ఇచ్చింది. నెలల పిల్లవాడు హెన్రిక్ పరిగెత్తుకుంటూ వచ్చి ఎత్తుకోమని చెప్పి చేతులు చాపాడు. మళ్ళీ తన ప్రపంచంలోకి, చిన్న ప్రపంచం లోకి, అతి సంక్లిష్ట ప్రపంచం లోకి, బాధామయ ప్రపంచం లోకి వచ్చి పడింది జెన్నీ.

ఆమె లేనటువంటి రోజుల్లో పిల్లల్ని జాగ్రత్తగా చూసుకున్న పనిమనిషి హెలెన్ కి కృతజ్ఞతలు చెప్పింది. "నువ్వున్నావు అనే ధైర్యం తోనే అక్కడకు వెళ్లి రాగలిగాను."అంది. హెలెన్ నీరసంగా నవ్వింది. జెన్నినీ, పిల్లల్నీ కంటికి రెప్పలాగా చూసుకుంటున్న హెలెన్, అంతో ఇంతో మార్క్సు అలవాట్లను నియంత్రించ గలిగినటువంటి హెలెన్, చాలా సందర్భాల్లో చాలా సార్లు నవ్వి ఉండవచ్చు. కానీ, ఈ సందర్భంలో హెలెన్ నవ్వినా ఆ నవ్వు వెనుక ఎంత గూడార్థం వుంది. అన్న విషయం ఆ క్షణంలో తెలియదు. గానీ, మరో 9 నెలల తర్వాత తెలిసింది. పెళ్ళికాని హెలెన్ ఒక బిడ్డకు తల్లయింది...!!

జెన్ని లేని ఆ నెలరోజులూ లండన్ లో ఏం జరిగిందంటే...ఇప్పుడు మనం తెలుసుకోబోయే విషయాలు ఆనాటి చరిత్ర కారులు అంటే 19 శతాబ్దంలో మార్క్సు చనిపోగానే, ఆయన గురించి రాసినటు వంటి చరిత్ర కారులు చాలా మంది మార్క్సు మీద వున్న గౌరవం తోనూ, అలాగే మార్క్సు వ్యక్తిత్వానికి మచ్చ రాకూడదన్న భావం తోనూ, దాచి పెట్టారు అని ఒక వాదన వున్నది. ఆ తరువాత 2౦ శతాబ్ధపు చరిత్ర కారులు, మార్క్సు, ఎంగెల్సుల మధ్య నడచిన ఉత్తరాలూ, జెన్ని రాసుకున్న డైరీలూ, మార్క్సు, జెన్నిల మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలూ వీటన్నిటినీ పరిశీలించి,

విశ్లేషించి ఇలా జరిగివుంటుంది అని నిర్ధారించారు. మరికొంత మంది "అలా కాదేమో" నని కూడా అన్నారు. అయితే, మార్క్స్ గురించి వచ్చిన జీవిత చరిత్రలన్నిటిలోనూ, ఎక్కువ సాధికారత కలిగిన పుస్తకంగా పరిగణింపబడుతున్నది ఇటీవల 2o11లో వచ్చింది. ఆ పుస్తకం పేరు "లవ్&కాపిటల్". 7oo పేజీలు. అది రాసింది "మేరి గాబ్రియల్" అనేటటువంటి 'రాయటర్ సంస్థ' లో సీనియర్ ఎడిటర్. ఆమె రాసినటువంటి కథనం ప్రకారం ఆ నెలలో ఏం జరిగిందంటే... ఒక నెల వెనక్కి వెళదాం...

జెన్నీ, మార్క్స్ బాబాయ్ ఇంటికి వెళ్లినటువంటి రోజుల్లో...ఒకానొక క్షణంలో అది బలహీనమైన క్షణమా? ఐచ్చికమైన క్షణమా? అనేటటు వంటిది మార్క్సకూ, హెలెన్లకు మాత్రమే తెలినటువంటి విషయం. ఆక్షణంలో మార్క్స్, హెలెన్లు ఒకటయ్యారు. అప్పటికి హెలెన్ వయసు 3o సంవత్సరాలు. మార్క్స్ వయసు 32 సంవత్సరాలు. జెన్నీ, మార్క్స్ లకు హెలెన్ అప్పటికి 15 సంవత్సరాల నుండి తెలుసు. జెన్ని, తన తల్లి తర్వాత, కుటుంబం తర్వాత ఎక్కువగా నమ్మింది హెలెన్నే. మరి జెన్నీ లేని సమయంలో అలా జరగడం, మార్క్స్ బలవంతం చేసి ఉంటాడా? లేక తనే లొంగి పోయిందా? ఆప్త మిత్రుడు ఎంగెల్సు కూడా దూరంగా వున్నాడు కాబట్టీ, మార్క్సకి ఓదార్పు అవసరమయ్యి, హెలెన్ ఆసరా తీసుకున్నాడా? బహుశా ఇద్దరూ మద్యం తీసుకున్న సమయంలో అలా జరిగిందో? వీటన్నిటికీ సమాధానాలు వాళ్ళిద్దరికీ మాత్రమే తెలియాలి. ఆ తరువాత 5,6 నెలలకి హెలెన్ గర్భవతి అన్న వార్త తెలిసినప్పుడు జెన్నికి కాళ్ళ కింద భూమి కంపించింది. ఆ పరిస్థితిలో జెన్నీ ఏం చేసింది? ఎలా ఎదుర్కొంది? భర్త నుండి కేవలం నిజాయితీ గల ప్రేమను మాత్రమే ఆశించిన జెన్నీ, మార్క్సల మధ్య ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? ఇదంతా 6 నెలల తర్వాత, హెలెన్ గర్భవతి అని తెలిసిన  ఏం జరిగిందో తర్వాత తెలుసుకుందాం.

మళ్ళీ మనం జెన్నీ,హాలెండు నుండి తిరిగే సమయం దగ్గరకు వద్దాం. ఇంట్లో ఎన్ని కష్టాలూ, కన్నీళ్ళూ నిరంతరం ప్రవహిస్తున్నప్పటికీ కూడా, మార్క్స్ బయట ఎన్ని ద్వేషాలూ, విభేదాలూ ఎదుర్కొన్నా కూడా ఇంట్లో అందరికీ ఆనందాన్ని పంచేది పిల్లలు. ఆడపిల్లలు ఇద్దరూ అందంగా ఎదుకుతున్నారు. చుట్టుపక్కల పిల్లల భాష వీళ్ళకు సరిగ్గా అర్థం కాక పోయినప్పటికీ, వాళ్ళతో కలసిపోయి ఆడుకుంటున్నారు. 3 సంవత్సరాల వయసు వున్న'ఎడ్గర్' అప్పటికే పాటలు పాడుతున్నాడు. ఎడ్గర్ పాడుతుంటే ఇంట్లో అందరూ కూడా తాత్కాలికంగా అన్నీ మరచిపోతుండేవారు. ఎటు తిరిగి 11నెలల హెన్రిక్ మాత్రమే అనారోగ్యంగా ఉండేవాడు. 185o నవంబర్ మొదటి వారంలో ఆ హెన్రిక్ మొదటి పుట్టినరోజు జరిగింది.

ఉన్నంత లోనే పిల్లల మధ్యన పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. అది గడచిన వారం రోజులకు హెన్రిక్ కు 'నిమోనియా' సోకింది. 185oనవంబర్ 19వ తేది. హెన్రిక్ వయసు ఒక సంవత్సరం దాటి 14 రోజులయ్యింది. ఉన్నట్టుండి ఆరోగ్యం బాగు పడినట్టయింది. చాలా హాయిగా, నవ్వుతూ ఆడుకోవడం మొదలు పెట్టాడు. అది జరిగినటు

వంటి రెండు గంటలకి...హఠాత్తుగా అపస్మారకం లోనికి వెళ్లి పోయాడు. అలా వెళ్ళిపోయిన ఆ పసిపిల్లాడుకొద్ది క్షణాల్లో కన్నుమూశాడు. శాశ్వతంగా ఈ లోకం నుండి నిష్క్రమించాడు. మార్క్స్, జెన్నీల పేదరికం తీసుకున్నటువంటి మొదటి బలి, కేవలం ఏడాది వయసు వున్నటు వంటి హెన్రిక్. సరైన పోషకాహారం, వైద్య సదుపాయం వుండి వుంటే బ్రతికి బట్ట కట్టి ఉండేవాడు.

అయితే, ఆ కుటుంబంలో పేదరికానికి బలవ్వడం ఇదిమొదలు మాత్రమే. ఆ చిన్నారి హెన్రిక్ మృత దేహాన్ని శవపేటికలో వుంచి, దగ్గరలో ఉన్నటువంటి శ్మశానానికి తీసుకువెళ్ళారు. ఆ శవ పేటిక వెంట 5,6 గురు మాత్రమే వున్నారు. జెన్ని గుండెలు పగిలేలా ఏడుస్తున్నది. పిల్లలకు ఏం జరుగుతున్నదో తెలియడం లేదు. అంతవరకూ తమతో ఆడుకున్న తమ్ముడు ఇప్పుడు లేడు అంతే..!! ఇంకెన్ని విషాదాలు వాళ్ళ కోసం కాసుకొని వున్నాయో ఆ చిన్నారులకు తెలియదు. ఎవరు నిష్క్రమించినా, ఏం జరిగినా జీవిత చక్రం ఆగదు కదా.

జెన్ని అప్పటికే 6 నెలల గర్భవతి. రాబోయే ప్రాణి కోసం, తన ప్రాణం కాపాడుకోవాలి. జారిపోతున్న ఆత్మ విశ్వాసాన్ని కూడగట్టుకొంటూ, మాములు మనిషవ్వడానికి ప్రయత్నించింది. ఇదంతా జరిగే సమయానికి వాళ్ళు లండన్ వచ్చి ఒక సంవత్సరం మాత్రమే అయింది. మరుసటి సంవత్సరం 1851లో మరిన్ని సంక్షోభాలూ, మరిన్ని కష్టాలూ.. ఎక్కడో చిన్న ఆశా రేఖ.. ఇవన్నీ జరిగాయి. అయినప్పటికీ మార్క్స్ తలపెట్టిన "కేపిటల్ "గ్రంధ రచన మాత్రం ఆగలేదు. ఎప్పుడు ఏం జరుగుతున్నా, ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా, ఎన్ని కన్నీళ్ళు రాలుతున్నా ఆ 'కేపిటల్' గ్రంధ రచన మాత్రం అలా కొనసాగుతూనే వుంది.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

.

2019 అక్టోబర్ 29 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS